క్లుప్తంగా

డెంగీతో యువతి మృతి

అశ్వాపురం: డెంగీ జ్వరంతో యువతి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కళ్యాణపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నర్సింగ్ విద్యార్థిని మేకల పల్లవి(18) నాలుగు రోజులుగా డెంగీతో బాధ పడుతూ ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది.

108 వాహనాన్ని ఏర్పాటు చేయండి

దుమ్ముగూడెం: మండల పరిధిలో ఉన్న 108 వాహనం మరమ్మతులకు గురి కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే నూతన 108 వాహనం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా చైర్మన్ కనుబుద్ధి దేవా శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానికంగా 108 లేక పోవడంతో చర్ల, భద్రాచలం మండలాల నుంచి వాహనం రావాల్సి వస్తోందని పేర్కొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ


డీఎంకు చెక్కు అందజేస్తున్న క్లబ్ బాధ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలోని దివ్యాంగులకు సారపాక రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో శనివారం ఉచిత బస్సు పాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ ఇన్ భద్రా సభ్యులు ఉచిత బస్సుపాసులకు సంబంధించిన రూ.18 వేలు విలువ గల చెక్కును రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా సారపాక అధ్యక్షుడు గోనె రాంబాబు, కార్యదర్శి డాక్టర్ విజయ్‌లు భద్రాచలం ఆర్టీసీ డిఎం రామారావుకు అందజేశారు. సత్యనారాయణ, సాయిరామ్, ఖాదర్, వై.సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు , బీఆర్‌కె రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

బూర్గంపాడు: జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించాలని డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాగిరెడ్డి శనివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. అక్రిడిటేషన్లతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని తెలిపారు.

దాడి ఘటనపై కేసు

ములకలపల్లి: దాడికి పాల్పడ్డ వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... మండలపరిధిలోని మూకమామిడి గ్రామానికి చెందిన శిగ రమణమ్మకు తన కుమారుడు శ్రావణ్‌కుమార్, కోడలు రేణుకకు అప్పుల విషయమై వాదోపవాదాలు జరిగాయి. దీంతో సమీపంలోనే ఉన్న శ్రావణ్‌కుమార్ వదిన లత దూషించి రమణమ్మతో కలసి శ్రావణ్, రేణుకలపై దాడికి పాల్పడ్డారు. శ్రావణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కిషోర్‌రెడ్డి తెలిపారు.

వైద్యశిబిరం

మణుగూరు రూరల్: మండల పరిధిలోని అయోధ్యనగర్‌లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి నివారణ మందులను పంపిణీ చేశారు. క్యాంప్ వైద్యాధికారి దుర్గా నరేష్, సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు,సిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, రాధ, నందిని, ఆశలు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనగరంలో..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీ నగరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కృష్ణానగర్ గ్రామస్తుల ఆందోళన

బూర్గంపాడు: కృష్ణసాగర్ పంచాయతీ కార్యాలయాన్ని ఎస్టీ కాలనీలో కాకుండా ఎస్సీ కాలనీలోనే నిర్మించాలని గ్రామస్తులు శనివారం ఆందోళన చేపట్టారు. నూతనంగా ఏర్పాటైన కృష్ణసాగర్ పంచాయతీకి భవనాన్ని నిర్మించేందుకు అధికారులు కృష్ణసాగర్ ఎస్టీ కాలనీలో స్థలం కేటాయించగా ఎస్సీ కాలనీలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. శనివారం నూతన గ్రామ పంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారనే సమాచారంతో ఎస్సీ కాలనీ వాసులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

దుమ్ముగూడెం: మండల సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలో నాటుసారా స్థావరాలపై శనివారం అధికారులు దాడులు నిర్వహించారు. ఒక ద్విచక్ర వాహనం,7 లీటర్ల నాటుసారా, 50 లీటర్ల పానకం స్వాధీనం చేసుకున్నారు. 12 డ్రమ్ములను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్, పోలీసు అధికారులు కరంచంద్, కేశవ్, డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

హమ్మయ్య.. ఇక సులువే..!

తుదిదశకు 'సీతమ్మ సాగర్' రహదారి పనులు

- ముంపునకు గురికాకుండా నిర్మాణం
- తగ్గనున్న దూరాభారం


గొల్లగూడెం నుండి సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్దకు వెళ్లేందుకు నిర్మించిన రహదారి

అశ్వాపురం: ఎన్నో ఏళ్లుగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్దకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేక పడ్డ ఇబ్బందులు తొలగిపోయాయి. ఇంతకుముందు మిట్టగూడెం నుంచి పాములపల్లి మీదుగా, అశ్వాపురం నుంచి అమెర్ధ మీదుగా అమ్మగారిపల్లి నుంచి ఆనకట్ట వద్దకు వెళ్లాలి. ఈ రహదారి మట్టి రహదారి కావడంతో వర్షాకాలంలో రాకపోకలు సాధ్యం అయ్యేవి కావు. దీంతో సీతమ్మ సాగర్ బ్యారేజీకి వెళ్లేందుకు ప్రత్యేకంగా రహదారి నిర్మించారు. రహదారి పనులు తుది దశకు చేరుకున్నాయి.

తొమ్మిది కిలోమీటర్ల రహదారి...

మండల పరిధిలోని గొల్లగూడెంలో సీతారామ కెనాల్ వంతెన పక్క నుండి సీతారామ కెనాల్ వెంబడి దుమ్ముగూడెం ఆనకట్ట వరకు తొమ్మిది కిలోమీటర్లు సిమెంటు రహదారి నిర్మించారు. రూ.90 కోట్లతో 2021లో ప్రారంభించిన రహదారి పనులు తుది దశకు చేరుకున్నాయి. గోదావరికి 63 అడుగులు వరదలు వచ్చినా ముంపునకు గురికాకుండా రహదారిని నిర్మించారు. రహదారి కొన్ని చోట్ల ఆరు మీటర్లు, మరి కొన్ని చోట్ల ఎనిమిది మీటర్ల ఎత్తుతో నిర్మించారు. సిమెంటు రహదారి పనులు పూర్తి కాగా మార్గ మధ్యలో అమ్మగారిపల్లి వద్ద బండిరేగులవాగు, జిన్నెలవాగు, చింతిర్యాల వద్ద అలుగువాగులపై వంతెనలు, అమెర్ధ, చింతిర్యాల వద్ద ర్యాంపుల పనులు సాగుతున్నాయి. ఈ రహదారిపై సీతమ్మ సాగర్ బ్యారేజీ పనులకు కావాల్సిన సామగ్రి, యంత్రాలు, భారీ వాహనాలు ఈ రహదారిపై వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది. సులువుగా వెళ్లే అవకాశం ఉంది.

తగ్గనున్న దూరాభారం..

గొల్లగూడెం నుంచి సీతారామ కెనాల్ వెంబడి నిర్మించిన రహదారిపై చింతిర్యాల, అమెర్ధ, అమ్మగారిపల్లి మీదుగా సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్దకు సులువుగా చేరుకోవచ్చు. సీతమ్మ సాగర్ బ్యారేజీ వంతెన పనులు పూర్తయితే వంతెన పైనుంచి నేరుగా దుమ్ముగూడెం మండలం బైరాగులపాడు అక్కడి నుంచి పర్ణశాల, భద్రాచలం చేరుకోవచ్చు. అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాలకు దూర భారం తగ్గనుంది.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


అశ్వారావుపేటరూరల్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర రావు అన్నారు. మండలంలోని తిరుమలకుంట నుంచి దమ్మపేట మీదుగా పాల్వంచ వెళ్లే బీటీ రోడ్డు పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. రహదారి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

గ్రామ పంచాయతీ భవనాలకు శంకుస్థాపన

మండలంలోని వేదాంతపురం, గాండ్లగూడెం గ్రామ పంచాయతీలకు నూతనంగా మంజూరైన భవనాల నిర్మాణాలకు శనివారం అశ్వారావుపేట నియోజక వర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇన్నాళ్లు పాలక వర్గం, ప్రజానీకం ఇబ్బందులు పడ్డారన్నారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సోని శివశంకర ప్రసాద్, భూక్యా చిలకమ్మ, ఐటీడీఏ డీఈ, ఏఈ ప్రసాద్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జడ్పీటీసీ సీహెచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులు యాఖుబ్ అలీ, నాగేశ్వర రావు, నాయకులు పాల్గొన్నారు.

దమ్మపేట మండలంలో..

దమ్మపేట: మండల పరిధిలోని నూతనంగా మంజూరైన పంచాయతీ భవనాలకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. సీతారాంపురం , అల్లిపల్లి పంచాయతీల నూతన భవనాల నిర్మాణానికి ప్రజా ప్రతినిధులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్‌ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, ఎంపీడీఓ నాగేశ్వర రావు, తహసీల్దార్ స్వామి, దొడ్డాకుల రాజేశ్వర రావు, సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తువులు సరఫరా చేయాలి


వ్యాపారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు, కాస్మోటిక్స్ సరఫరా చేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్, గురుకులాల ఇన్‌చార్జి ఆర్సీఓ గురుకులం, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డేవిడ్ రాజ్ సూచించారు. శనివారం ఐటీడీఏ సమావేశం మందిరంలో జీసీసీ ద్వారా సరఫరా అయ్యే నిత్యావసర వస్తువులు, కాస్మోటిక్స్‌కు నిర్వహించిన టెండర్ ప్రక్రియలో ఆయన పాల్గొని మాట్లాడారు. కల్తీ సరుకులు సరఫరా చేసినా, నాణ్యత కొరవడినట్లు విద్యాలయాల నుంచి ఫిర్యాదులు అందినా సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీసీసీ అధికారులు, మేనేజర్లు వస్తువుల నాణ్యతను పరిశీలిస్తూ ఉండాలని, నాసిరకంగా ఉన్న వస్తువులను పాఠశాలలకు సరఫరా కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు విజయ్ కుమార్, నరసింహారావు, చంద్రమోహన్, దావీదు, నరసింహారావు, రంగయ్య, నారాయణ పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పథకాలు


అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ లలిత

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ సున్నం లలిత అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల వ్యాప్తంగా పంచాయతీల్లో శనివారం గిరిజనోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. పంచాయతీలలో ర్యాలీలు చేపట్టి, గ్రామసభలు నిర్వహించారు. తొట్టిపంపు గ్రామ పంచాయతీలో జరిగిన సభలో సర్పంచులు,ఎంపీటీసీలు, అధికారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బూర్గంపాడు: పినపాకలో భోగ్ భండారో..

బూర్గంపాడు: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి గిరిజన తండాలకు, గూడేలకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. పినపాక పట్టీనగర్ గ్రామపంచాయతీలో గిరిజన దినోత్సవం సందర్భంగా భోగ్ భండారో కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బానోత్ పరమేశ్వరి , సేవాలాల్ సేన మండల అధ్యక్షులు భూక్యా రాము ఆధ్వర్యంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో భోగ్ భండారో నిర్వహించారు.


దుమ్ముగూడెం: మాట్లాడుతున్న ముత్యాలరావు

దుమ్ముగూడెం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని గిరిజన దినోత్సవం సందర్భంగా మండలంలోని పంచాయతీల కార్యాలయాల దగ్గర ప్రజలు ఆట పాటలతో సందడి చేసి సభలను నిర్వహించుకున్నారు. కొత్తపల్లి పంచాయతీలో జరిగిన వేడుకల్లో ఎంపీడీఓ ముత్యాలరావు పాల్గొని సంక్షేమ పథకాలను వివరించారు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు పున:ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: పోస్టాఫీసులో ఆధార్ సేవలను పున:ప్రారంభించినట్లు పాల్వంచ, సత్తుపల్లి ఎస్‌డీఐపీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం మాట్లాడుతూ..అశ్వారావుపేటలోగల పోస్టాఫీసులో ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని, ఈ సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సేవలు అశ్వారావుపేటతోపాటు సత్తుపల్లి పోస్టాఫీసులో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మెడికల్ కాలనీ రెండో లైన్‌లో రోడ్డుపై మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కోసం తీసిన గుంతను అధికారులు ఎట్టకేలకు శనివారం పూడ్చించారు. రోడ్డుపై గుంతను తీసి సుమారు రెండు నెలలు కావస్తున్న పూడ్చక పోవడంతో సాక్షి దినపత్రికలో 'పొంచి ఉన్న ప్రమాదం' అను శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి గుంతను పూడ్చించారు.

సేవ చేయడంలో తృప్తి


పెన్నులు, పుస్తకాలు అందజేస్తున్న సీఐ రాజగోపాల్

కరకగూడెం: సేవ చేయడంలో ఎనలేని సంతృప్తి ఉంటుందని ఏడూల బయ్యారం సీఐ రాజగోపాల్ అన్నారు. రాబిన్ హుడ్ ఆర్మీ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డీపీఎస్ పబ్లిక్ స్కూల్ నాచారం సహకారంతో మండలంలోని అనంతారం, బర్లగూడెం, రఘునాథపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ సామాన్లను అందజేశారు. ఏఎస్సై రాజారామ్, ఉపాధ్యాయులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తిమ్మంపేటలో 'బడిబాట'


బడిబాట ర్యాలీ..

ములకలపల్లి: మండలపరిధిలోని తిమ్మంపేట, గుండాలపాడు జీపీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బూర్గంపాడు బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం దేవ్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీటీసీ నూపా సరోజని, సర్పంచ్ కారం కుమారి, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, నూపా భాస్కర్, కృష్ణ, పెద్దరవి, వెంకటేశ్వర్లు, వీరభద్రం, రాజు, కాంట్రాక్ట్ టీచర్లు రూప్లా. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు తనిఖీ తప్పనిసరి

బూర్గంపాడు: ప్రతీ ఓటరు తమ ఓటును తప్పనిసరిగా తనిఖీ చేయించుకోవాలని తహసీల్దార్ భగవాన్‌రెడ్డి సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం శనివారం సారపాకలో బీఎల్‌ఓల ఆధ్వర్యంలో ఇంటింటికి ఓటరు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... బీఎల్‌ఓలు తమ ఓటరు జాబితాతో ఇంటింటికి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. వారికి ఓటర్లు సహకరించి ఓటర్ కార్డుతో ఓటును సరిచూసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్వేకు ఓటర్లు అందరు సహకరించాలని కోరారు.

కుట్రపూరితంగానే మేధావులపై కేసులు


బూర్గంపాడు: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్డీ నాయకులు

బూర్గంపాడు: ప్రజాసంఘాల నాయకులపై, మేధావులపై కుట్రపూరితంగానే ఉపా కేసులు పెట్టారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి జక్కుల రాంబాబు ఆరోపించారు. ప్రజా సంఘాల నాయకులు, మేధావులపై ఉపా కేసులు పెట్టడాన్ని నిరసిస్తు శనివారం మండలంలోని రాజీవ్‌నగర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002లో తాడ్వాయిలో దొరికిన డైరీ ఆధారంగా మరణించిన వారిపై, జైల్లో ఉన్నవారిపై కేసులు నమోదు చేయటం సిగ్గుచేటన్నారు. నాయకులు కుంజా భద్రా, సురేష్ , వీరన్న, శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: ప్రజల హక్కులను ప్రశ్నించే ప్రజానాయకులపై పాలకులు బనాయించిన అక్రమకేసులను ఎత్తివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరికూటి వెంకట్రావ్, రమేష్, వీరన్న, బాలు, రాములు పాల్గొన్నారు.

గుండాల: తెలంగాణలో ప్రజా సంఘాలు, రచయితలు, హక్కుల సంఘాల నేతలపై జాతీయ దర్యాప్తు సంస్థ ఉపా, రాజద్రోహం కేసులు నమోదు చేయడం దుర్మార్గమని అఖిల భారత ఆదివాసీ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, జిల్లా నాయకులు కొమరం సీతారాములు అన్నారు. మండల కేంద్రంలో శనివారం న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, అరెం నరేష్, యాసారపు వెంకన్న, పర్శిక రవి, గడ్డం లాలయ్య, ఈసం క్రిష్ణ, లాలు, వెంకటేశ్వర్లు, గుర్రం పుష్పరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండ: మాట్లాడుతున్న ఉమర్



గుండాల: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వితరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తాటి నాగులగుంపు గ్రామానికి చెందిన కుంజా మంగ పూరిల్లు దగ్ధమయ్యగా వాసవిక్లబ్, నామా ముత్తయ్య ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం , దుస్తులు, వంట గిన్నెలు, దుప్పట్లు, సామగ్రి అందించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కాలిపోయిన పూరిల్లు పరిశీలించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ నారం రాజశేఖర్, వాసవిక్లబ్ బాధ్యులు శీమకుర్తి సుబ్బారావు, నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు, శ్రీను ఉన్నారు.

ఇసుక లారీ బోల్తా

ములకలపల్లి: ఇసుక లారీ బోల్తా పడిన ఘటన మండలపరిధిలో తిమ్మంపేట శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుకలోడుతో వెళ్తున్న టిప్పర్ తిమ్మంపేట శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలయ్యాయి.

అక్రమ ఆయుధాలుంటే కఠిన చర్యలు

దుమ్ముగూడెం: అక్రమంగా ఆయుధాలు ఉంటే పోలీస్‌స్టేషన్లో అప్పగించాలని లేని పక్షంలో చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని ఏఎస్పీ పరితోజ్ పంకజ్ హెచ్చరించారు. మండలంలోని సర్పంచ్‌లతో శనివారం సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతులు విత్తనాలు లైసెన్స్‌లు ఉన్న షాపుల్లోనే కొనుగోలు చేయాలన్నారు. ప్రతీ ఒక్కరికి సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని, అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌కు స్పందించి వ్యక్తిగత సమాచారం ఇవ్వొదన్నారు. అటవీ ప్రాంతంలో జంతువుల కోసం కరెంటు తీగలు పెట్టొదని, ఎవరైనా పెట్టినట్టు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ రేసు లక్ష్మి, సీఐ దోమల రమేష్, ఎస్సైలు కేశవ్,నర్సిరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఎస్పీ పరితోజ్ పంకజ్

బీఎస్పీలో చేరిక


మాట్లాడుతున్న రవికుమార్

చర్ల: బహుజనుల చూపంతా బీఎస్పీ వైపే ఉందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్ అన్నారు. మండలంలోని జీపీ పల్లిలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రవికుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీ మండలాధ్యక్షుడు కూరపాటి వీర్రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అణగారిన ప్రజానీకం అంతా రాష్ట్రంలో దేశంలో ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నాయని ఈ క్రమంలోనే వారందరూ పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇల్లందుల శేషావతారం, సేడే వీరాస్వామి, కొప్పుల రాంబాబు, కొప్పుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వం బీసీలకు అందించనున్న ఆర్థికసాయం సంబంధించి దరఖాస్తుల గడువు తేదీ పెంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు మారెడ్డి శివాజీ, బత్తుల నరసింహులు, కల్లూరి శ్రీ రాములు, అయినాల రామకృష, యువజన సమాఖ్య నాయకులు డానియల్, ప్రదీప్, కొలిపాక శివ, భరణి, హరీష్ ఉన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా..

మణుగూరు రూరల్: దరఖాస్తు గడువును పొడిగించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడి అనంతరం సీనియర్ అసిస్టెంట్ నరసింహరావు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రాములు, కార్యదర్శి వర్గసభ్యులు లెనిన్‌బాబు, సాంబశివరావు, ఈశ్వర్ రావు, కోండ్రు గౌరి, రాములు, గుర్రం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఇబ్బందులకు గురిచేయొద్దు

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీలో పని చేస్తున్న భారీ యంత్రాల ట్రాక్ క్లీనింగ్ (హెచ్‌ఈఎంఎం) కాంట్రాక్ట్ కార్మికులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ గని యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు. శనివారం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై గని మేనేజర్ రాజేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగీలాల్ మాట్లాడుతూ... మణుగూరు ఓసీలో హెచ్‌ఈఎంఎం పనుల నిర్వహణ కోసం కాంట్రాక్టర్ అత్యాశకు పోయి పరిమితికి మించి కాంట్రాక్ట్ కార్మికులను నియమిస్తున్నారన్నారు. ఈ సమస్యపై గని ప్రాజెక్ట్ అధికారి చొరవ తీసుకుని పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కె.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, విజయ్, నరేష్, కృష్ణారెడ్డి, సత్యం, రమేష్, రాజేష్, భాస్కర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం


లలిత్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్‌ఓటు జీఎంగా పని చేస్తూ పదోన్నతి బదిలీపై కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయానికి వెళ్తున్న లలిత్‌కుమార్‌ను కాంట్రాక్ట్ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు శనివారం సన్మానించారు. ఏరియాలో ఎస్‌ఓటు జీఎం లలిత్‌కుమార్ -అనిత దంపతులు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు, నాయకులు నాసర్‌పాషా, మంగీలాల్, కాంతారావు, అమీరుద్దీన్, కిరణ్, కార్మికులు నరసింహారావు, కిరణ్, పద్మకుమారి, రాజేశ్వరి, వెంకటలక్ష్మీ, లక్ష్మీ, నారాయణమ్మ, వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ బాలాజీ కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు ఆలయ అధికారులు అన్నప్రసాదాలను అందజేశారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు